
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శుక్రవారం 3 జనవరి 2025





పుస్తక మహోత్సవం ప్రాంగణంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



అక్షర యాగం ఆరంభం

6లో



పుస్తక మహోత్సవం స్టాల్స్ వద్ద ఆసక్తిగా పుస్తకాలను తిలకిస్తున్న యువత

35వ పుస్తక మహోత్సవం ఘనంగా ప్రారంభం

ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- ఇందిరాగాంధీ స్టేడియంలో కొలువుదీరిన విజ్ఞాన సంపద
- వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రచురణకర్తలు
- తొలిరోజే భారీగా హాజరైన పుస్తకప్రియులు

అక్షర యాగానికి అంకురార్పణ జరిగింది. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా, వేల పుస్తకాలు కొలువుదీరాయి. ఈ మహోత్సవానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలిరోజే పుస్తక ప్రియుల తాకిడి మొదలైంది. తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రచురణకర్తలు భారీగా తరలివచ్చారు. ఈసారి ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రచురణకర్తలు వచ్చారు. 2024లో ప్రచురించిన పుస్తకాలను స్టాళ్లలో ప్రదర్శించారు. కాగా, ఇప్పటి వరకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీలో ప్రతినిధులుగా పనిచేసిన వారిని పవన్ కల్యాణ్ పరిచయం చేసుకున్నారు. వారంతా ఆయనకు వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. వీబీఎఫ్ఎస్ ప్రతినిధులు మహాభారత విజ్ఞాన సర్వస్వం పుస్తకాన్ని బహూకరించారు. - (ఆంధ్రజ్యోతి,విజయవాడ)

పేదరికపు పరుగులో కుప్పకూలీ..

కానిస్టేబుల్ నియామక పరీక్షలో యువకుడు మృతి

మచిలీపట్నంలో పరుగు పందెం జరుగుతుండగా..

- కార్డియాక్ అరెస్టుగా తేల్చిన వైద్యులు
- మృతుడిది ఎ.కొండూరు మండలం జీళ్లకుంట
- పేదరికంలో పుట్టి.. ప్రభుత్వ ఉద్యోగం కోసం సాధన



చంద్రశేఖర్ (ఫైల్)

ఓవైపు పేదరికం.. మరోవైపు ఉద్యోగ లక్ష్యం.. ఇంకోవైపు అనారోగ్యం.. ఈ మూడూ కలిసి ఆ యువకుడి ప్రాణం తీశాయి. ఎలాగైనా ఉద్యోగం పొంది తల్లిని, చెల్లిని ఆదుకోవాలన్న అతని కసి చివరికి కుప్పకూలిపోయింది. కానిస్టేబుల్ ఉద్యోగ నియామక పరీక్షల్లో భాగంగా మచిలీపట్నంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఫిజికల్ ఎఫిసియెన్సీ టెస్టుకు సంబంధించి 1,600 మీటర్ల రన్నింగ్ పోటీలు గురువారం జరగ్గా, నాల్గో రౌండ్ పూర్తికావడానికి కొద్ది సమయంలో కుప్పకూలిపోయి మృతిచెందిన ఎ.కొండూరు మండలం జీళ్లకుంటకు చెందిన ధరావత్ చంద్రశేఖర్‌రావు వెనుక కన్నీటి కథ ఉంది.

ఎ.కొండూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎ.కొండూరు మండలం జీళ్లకుంటకు చెందిన ధరావత్ చంద్రశేఖర్‌రావు (25)ది నిరుపేద కుటుంబం. ఏడేళ్ల కిందట తండ్రి దేవా మృతిచెందాడు. కుటుంబ భారమంతా తల్లి మణిపైనే పడింది. అయినా ఆమె వెనకడుగు వేయలేదు. కూలి పని చేసుకుంటూ కొడుకు చంద్రశేఖర్‌రావును డిగ్రీ వరకూ చదివించింది. కష్టపడి కూతురుకు పెళ్లి చేసింది. తల్లి కష్టాన్ని చూసి చలించిపోయిన చంద్రశేఖర్ ఎలాగైనా ఆమెకు చేదోడుగా ఉండాలనుకున్నాడు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఆమెను బాగా చూసుకోవాలనుకున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోలీసు కానిస్టేబుల్ నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేయడంతో దరఖాస్తు చేశాడు. గురువారం మచిలీపట్నంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యాడు. 1,600 మీటర్ల పరుగు పందెంలో మిగతా 6లో..

అంతా అక్రమమే!

అసైన్డ్ భూముల నుంచి అక్రమంగా మట్టి తరలించి పేర్ని గోడౌన్ మెరక

- నాటి నుంచి నేటి వరకు అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- బాధితుల ఫిర్యాదులపై స్పందించిన మైనింగ్ అధికారులు
- పరిశీలనకు వస్తే గేటుకు తాళాలు

మచిలీపట్నం మండలం పొట్లపాలెంలోని మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్ వ్యవహారంలో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. గోడౌన్‌ను అద్దెకు తీసుకున్న పౌరసరఫరాలశాఖ నిల్వ చేసిన బియ్యం తరిగిపోవడం దగ్గర నుంచి గోడౌన్ మెరక పనుల వరకు అంతా అక్రమంగానే జరిగాయని ఆరోపణలు వస్తున్నాయి. తమ భూముల్లోని మట్టిని అక్రమంగా తవ్వారని బాధితులు ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు స్పందించారు. విచారణకు వస్తే గేటుకు తాళాలు వేసి తప్పించుకున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

-ఆంధ్రజ్యోతి,మచిలీపట్నం

పేర్ని నాని గోడౌన్ నిర్మాణం, నిర్వహణపై సర్వత్రా విమర్శలు



పేర్ని నాని గోడౌన్‌ల గేటు వద్ద మైనింగ్ అధికారులు

పేర్ని నాని గోడౌన్‌ల వద్దకు మైనింగ్ అధికారులు

మచిలీపట్నం మండలం పొట్లపాలెంలోని మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌ల వద్ద మెరక పనులు చేసేందుకు అక్రమంగా మట్టి తవ్వకాలు చేశారని, సీనరేజీ కూడా కట్టలేదని ఇటీవల పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణాజిల్లా మైనింగ్‌శాఖ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసకుమార్ తన సిబ్బందితో గురువారం గోడౌన్ వద్దకు వచ్చారు. గేటుకు తాళాలు వేసి ఉండటంతో స్థానిక తహసీల్దార్‌ను అక్కడకు రావాలని కోరారు. అయితే తహసీల్దార్, రెవెన్యూ అధికారులు తాము వేరే కార్యక్రమంలో ఉన్నామని, గోడౌన్ వద్దకు వచ్చేసరికి ఆలస్యమవు తుందని సమాధానం ఇచ్చారు. గోడౌన్ గేటు తాళాలు పగలకొట్టి లోపలికి వెళ్లాలంటే మండల స్థాయి మెజిస్ట్రేట్ అక్కడ ఉండాల్సి రావడం, ఆయన అందుబాటులో లేకపోవడంతో ఆ ప్రయత్నం విరమించారు. పేర్ని నానికి ఫోన్ చేయగా ఆయన అందుబాటులో లేకపోవడంతో మైనింగ్ అధికారులు వెనుదిరిగారు. ప్రస్తుతం గోడౌన్‌కు సంబంధించిన స్థలాన్ని చూసి వెళుతున్నామని, అన్ని ఏర్పాట్లతో వచ్చి ఈసారి పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని మైనింగ్ విభాగం అధికారి తెలిపారు.

అనుమతుల్లేకుండా మెరక పనులు

వైసీపీ ప్రభుత్వం హయాంలో భూముల రీసర్వేలో భాగంగా పొట్లపాలెం గ్రామాన్ని జిల్లాలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. అప్పట్లో పేర్ని నాని మనుషులు ఇక్కడి భూముల రీసర్వేలో అంతా తామై వ్యవహరించారు. అసైన్డ్ భూములను, ప్రభుత్వ భూములను తమ గుప్పిట్లో మిగతా 6లో..

జిల్లాపై మంచు దుప్పటి



నాగాయలంకలో రోడ్డుపై దట్టంగా కమ్మేసిన పొగమంచు

జిల్లాను మంచు దుప్పటి కప్పేసింది. గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టమైన పొగ మంచు కురిసింది. రోడ్లు స్పష్టంగా కనిపించక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకుని ఆ వెలుగులో ముందుకు సాగారు. వాన తుంపర్ల వలే మంచు పడటం, తీవ్ర చలిగాలులు వీయడంతో ప్రజలు గజగజవణికిపోయారు.

-నాగాయలంక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి)

ఐసీడీఎస్ పీడీలపై వేటు

రెండు జిల్లాల పీడీల సస్పెన్షన్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల ఐసీడీఎస్ పీడీలపై సస్పెన్షన్ వేటు పడింది. రెండు జిల్లాల ఐసీడీఎస్ పీడీ కార్యాలయాలు రెండూ కానూరులో ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. దీంతో ఇద్దరు పీడీలు జిల్లా కేంద్రంలో అందుబాటులో లేకుండా పోతున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు.. జిల్లా కేంద్రాల్లో కార్యాలయాలు తీసుకుని అక్కడ అందుబాటులో ఉండాలంటూ వారిద్దరికీ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేశారు. ఈ కారణంగా ఎన్టీఆర్ జిల్లా పీడీ జి.ఉమాదేవి, కృష్ణాజిల్లా పీడీ ఎస్.సువర్ణను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

హత్యల కలకలం!

- న్యూ ఇయర్ వేడుకల్లో ఇద్దరి హత్య
- మద్యం మత్తులో పొడిచి చంపేసిన దుండగులు
- రామవరప్పాడు, తెల్లదేవరపల్లిలో ఘటనలు

6లో

ఆధార్ నంబర్లతో పరిహారం

కొల్లగొట్టారు!

తవ్వేకొద్దీ వెలుగు చూస్తున్న వ్యవసాయాధికారి అవినీతి

పురుగు మందుల షాపులో పనిచేసే మహిళకు సైతం పరిహారం

- ఏడాది కిందట మరణించిన మహిళ అకౌంట్లో జమ
- ఈ అవినీతి వ్యవహారంలో మరిన్ని తలకాయలు

ఆధార్ నంబర్ల ఆధారంగా పంటల నష్టపరిహారం సొమ్మును మండల వ్యవసాయ అధికారి కొల్లగొట్టారు. పురుగు మందుల దుకాణాల యజమానులు, ఆ షాపుల్లో పనిచేసే మహిళలను రైతులుగా చూపి వారి బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమ చేశారు. ఈ నకిలీ రైతుల వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికారుల తీరుపై మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తోట్లవల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరులో మండల వ్యవసాయ అధికారి అవినీతి లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తోట్లవల్లూరులోని నందిని ఎంటర్ ప్రైజెస్‌లో శ్రీకాకుళపు కుసుమకుమారి పనిచేస్తున్నారు. ఆమె గౌడ సొసైటీలోని 331/1 సర్వే నంబరులో 1.46 ఎకరాలలో అరటి సాగు చేసి పంటను నష్టపోయినట్టుగా జాబితాలో చూపి ఆమె బ్యాంకు ఖాతాలో రూ.20,545 పరిహారం చెల్లించారు. ఈ వివరాలు గురువారం వెలుగులోకి వచ్చాయి. అయితే ఆమె వేరే కులస్తురాలు. గౌడ సొసైటీకి సంబంధం లేదు. అధికారులు ఎంత ధైర్యంగా అక్రమాలకు పాల్పడ్డారో కుసుమకుమారి విషయం తెలియజేస్తోంది. పరిహారం విషయమై సదరు షాపునకు వెళ్లి కుసుమకుమారిని వివరాలు అడగ్గా నాకు పొలం లేదు, నేను పంటలు సాగుచేయలేదని చెప్పారు. మీకు పంటల నష్టపరిహారం వచ్చిన విషయం తెలుసా అని అడగ్గా రూ.30 వేలు వచ్చిందన్నారు. ఎలా వచ్చిందటే మా షాపు యజమాని ఆధార్‌కార్డు అడిగితే ఇచ్చానని, అంతకు మించి తనకు ఏమి తెలియదన్నారు. ఆ రూ.30 వేలు తీసి షాపు యజమానికి ఇచ్చానని వివరించారు. తోట్లవల్లూరులో శివ కాంతమ్మ ఆగ్రో ఏజెన్సీస్ మిగతా 6లో..







ఉనికి పునాది పుస్తకం



» పఠనంతోనే జ్ఞానసంపద

» పుస్తక మహోత్సవం ప్రారంభోత్సవంలో వక్తలు

విజయవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిత్వ వికాసం.. మానసిక ఉల్లాసం.. సామాజిక పురోగతి.. సాంస్కృతిక ఎల్లల వారసత్వ పరిరక్షణకు పుస్తకాలు అంగరక్షకులుగా ఉంటాయని, ఉనికికి 'పుస్తకం' పునాది వంటిది అని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. '35వ విజయవాడ పుస్తక మహోత్సవం' ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం రాత్రి ప్రారంభమైంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జ్యోతిప్రజ్వలన చేసి మహోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ టి.అప్పలనాయుడు, కలెక్టర్ లక్ష్మీషా, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పవన్ చూస్తుండగా ఆగిన పవర్

ప్రారంభోత్సవ సభ ముగిసిన అనంతరం పవన్ కల్యాణ్ సభా వేదికకు వెనుక వైపు ఉన్న విశాలాంధ్ర బుక్‌స్టాల్స్‌ను సందర్శించారు. ఆయన బుక్‌స్టాల్‌లో పుస్తకాలు పట్టుకోగానే పవర్ ఆగిపోయింది. విద్యుత్ దీపాలు ఆరిపోయాయి. సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో ఆయన పలు పుస్తకాలను పరిశీలించారు.

జ్ఞానార్జన అందమైన వ్యసనం

- ఎమెస్కో విజయ్‌కుమార్

జ్ఞానం సంపాదించడం ఒక అందమైన వ్యసనం. ఇది పుస్తక పఠనంతో సాధ్యమవుతుంది. పవన్ కల్యాణ్‌కు జ్ఞానస్థైర్యం ఎక్కువ. దాన్ని పుస్తకాలు ఇచ్చాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పుస్తక మహోత్సవం నిర్వహించడానికి కారణం ఆయనే. ఇక్కడ స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేసినప్పుడు పవన్ కల్యాణ్ చొరవ తీసుకుని ఇప్పించారు.

నాలుగేళ్లు ఎన్నో ఇబ్బందులు పడ్డాం

- మనోహర నాయుడు, వీబీఎఫ్ఎస్ కార్యదర్శి

విజయవాడలో పుస్తక మహోత్సవం నిర్వహించడానికి 2019 నుంచి 2024 ఎన్నో ఇబ్బందులు పడ్డాం. కరోనా సమయంలో పుస్తక మహోత్సవం నిర్వహించలేదు. మిగిలిన నాలుగేళ్లు చాలా ఇబ్బంది పడ్డాం. పుస్తక ప్రదర్శనకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను కేటాయించాలని కోరినా ఆ ప్రభుత్వం స్పందించలేదు. మాకు ఎలాంటి సహకారం ఇవ్వలేదు. గ్రంథాలయాలకు పుస్తకాలు కొనుగోలు చేసి ఆ డబ్బులను ఇప్పటి వరకు ప్రచురణకర్తలకు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో అటువంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నాం. పవన్ కల్యాణ్ విశాలాంధ్ర బుక్ హౌస్‌కు వచ్చినప్పుడు తెలుగు ఉండాలని, తెలుగును పరిరక్షించాలని చెప్పారు. ఆయన ఒక విజ్ఞాన భాండాగారం.

సామాజిక పురోగతికి జ్ఞానం దోహదం

- కె.శ్రీనివాసరావు, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి

జ్ఞానం సామాజిక పురోగతికి దోహదం చేస్తుంది. జ్ఞానంతో ఉన్న సమాజం సామాజికంగా, ఆర్థికంగా పురోగతిని సాధిస్తుంది. సమాజంలో కొంత భాగమే జ్ఞానం ఉంటే కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఉండదు. పుస్తకాలు కొత్త విజ్ఞానాన్ని అందజేస్తాయి. పుస్తకాలు సంస్కృతి, సృజానాత్మకత, ఊహాశక్తిని బలోపేతం చేస్తాయి. పుస్తకం తల్లి వంటిది. పుస్తకాలు సంస్కృతి, వారసత్వ సంపదను పరిరక్షిస్తాయి. ప్రస్తుతం ఉన్న సామాజిక మాధ్యమాలు, టీవీ ప్రసారాల్లో మునిగిపోవడంతో పుస్తకాలు దూరమవుతున్నాయి. పిల్లల్లో పఠనా శక్తి తగ్గుతోంది. దేశంలో ప్రచురణకర్తల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది.



'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు రాసిన 'భారతీయ సాహిత్య నిర్మాతలు - పాములపర్తి వెంకట నరసింహారావు' పుస్తకావిష్కరణలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు



పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థినులు



కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం పోలీస్ పశుసంవర్ధక, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖాధికారులతో కోడిపందేల నిషేధంపై తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా కోడిపందేలు నిర్వహించకుండా సంబంధిత అధికారులు పటిష్టచర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం అధికారులతో డివిజన్, మండల, గ్రామ స్థాయి బృందాలను ఏర్పాటుచేసి పకడ్బందీ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించాలని, ఆదేశాలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, బెట్టింగులు, పేకాట శిబిరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలని చెప్పారు. గతంలో కోడిపందేల నిర్వహించిన వారిని, కత్తులు కట్టే వారిని గుర్తించి బైండవర్ కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో టాంటాం వేయించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, ఆర్డీవోలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, బీఎస్‌హేలా షారోన్, పశుసంవర్ధకశాఖ అధికారి చిన్న నరసింహులు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, కమిషనర్ బాపిరాజు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



యువకెరటాలు కార్యక్రమంపై సమీక్షిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

నేటి నుంచి యువకెరటాలు

» రెండు రోజుల పాటు యువతకు వినోదం, విజ్ఞానం

మచిలీపట్నం టౌన్, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : యువతకు వినోదంతో పాటు విజ్ఞానం అందిచాలనే లక్ష్యంతో పద్మావతి జూనియర్ హిందూ కళాశాల ప్రాగణంలో శుక్రవారం నుంచి రెండురోజుల పాటు 'యువకెరటాలు' కార్యక్రమం నిర్వహించనున్నట్టు కొల్లు ఫౌండేషన్ డైరక్టర్ కొల్లు పునీత్, టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్‌లు పేర్కొన్నారు. సినీ కళాకారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. యువకెరటాలు ద్వారా యువతలో నూతన ఉత్సాహాన్ని నింపుతామన్నారు. గురువారం హిందూ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లపై కొల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కొల్లు నీలిమతో పాటు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ అబ్దుల్ సుబాన్ తదితరులు సమీక్షించారు. మెప్మా పీడీ సాయిబాబు మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 10వేల మంది విద్యార్థులతో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో గోపు సత్యనారాయణ, ఎండీ ఇలియాస్ పాషా, లంకే శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్ల పరిశీలన

కృష్ణలంక : పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మంత్రి నారా లోకేశ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో కళాశాలలో ఏర్పాట్లను గురువారం ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృత్తికా శుక్లా, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు, కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలో వేదిక ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. విద్యార్థులతో వర్చువల్‌గా మంత్రి మాట్లాడనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంత్రి లోకేశ్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయనున్నారు. ఏర్పాట్ల పరిశీలనలో జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సి.శివసత్యనారాయణరెడ్డి, ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

» రూ.33 లక్షల బయో ఉత్పత్తుల విక్రయాలు నిలిపివేత

మైలవరంరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రాలలో శ్రీసాయికృష్ణ ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ కమిషనర్ ఆదేశాలతో గురువారం వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులోని రిజిష్టర్లు, లైసెన్స్ కాపీలను సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు, వ్యవసాయాధికారి ఎన్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు తనిఖీ చేశారు. బయో స్టిములెంట్స్‌కు సంబంధించిన ఉత్పత్తులకు సరైన పత్రాలు లేకపోవడంతో రూ.33,04,85లు విలువ గల ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

విస్తృత ప్రజాప్రయోజనాలపై దృష్టి పెట్టండి

» రైల్వేతో ముడిపడిన అంశాల్లో పురోగతిపై నిరంతర సమీక్ష

» ఉమ్మడి తనిఖీల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలి

» డీపీఆర్‌లు, ప్రతిపాదనల రూపకల్పన ప్రక్రియ కీలకం

» సమీక్షా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడిన ప్రాజెక్టులపై ప్రత్యేక చొరవ చూపాలని, ఇందుకు సమన్వయ శాఖల అధికారులు దృష్టిసారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పనులు, భవిష్యత్తు ప్రాజెక్టులు, వాటిని చేపట్టే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, దక్షిణ మధ్య రైల్వే, ఎన్‌హెచ్ఏఐ, జలవనరుల అభివృద్ధి, డ్రెయిన్లు, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా మంజూరైన పనులు, వాటిలో పురోగతి, భవిష్యత్తులో చేపట్టే పనులు తదితరాలపై సమీక్షించారు. వివిధ పనులకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) త్వరితగతిన రూపొందించాలని, ఇందుకు అవసరమైన ఉమ్మడి తనిఖీల ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. రైల్వేతో సంబంధమున్న పనుల పూర్తికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమృత్ భారత్ పథకం కింద నిధుల మంజూరు, సత్తెనపల్లి-కొంపల్లి రైల్వేలైను తదితరాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుణదల రైల్వే ఓవర్ బ్రిడ్జి, సింగనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి, వాంబేకాలనీ వద్ద డబుల్ లైన్ రైల్వే అండర్‌బ్రిడ్జి, మధురానగర్ పప్పుల మిల్లు వద్ద డబుల్ లైన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితరాలపై సమావేశంలో చర్చించారు. తిరువూరు పట్టణంలోని అంతర్గత రహదారుల మరమ్మతుల పనులపైనా చర్చించి, సాంకేతిక అంశాల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. జగ్గయ్యపేట, నందిగామ పట్టణాలకు తాగునీటి సరఫరాతో వివిధ తాగునీటి పథకాలకు సంబంధించిన మరమ్మతులపైనా దృష్టిపెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రతిపాదనలు, డీపీఆర్‌లు రూపొందించాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులకు సూచించారు. అదేవిధంగా వెలగలేరు వద్ద హెడ్ రెగ్యులేటరీ గేట్స్ రీప్లేస్‌మెంట్, జి.కొండూరు తారకరామ ఎత్తిపోతల పథకానికి మోటార్లు సమకూర్చే అంశంపైనా ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీవో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య, సీపీవో వై.శ్రీలత, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్‌తో పాటు రైల్వే, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి, చిత్రంలో కలెక్టర్ బాలాజీ, బ్యాంకు అధికారులు

కౌలు రైతులకు నూరుశాతం పంట రుణాలు మంజూరు చేయాలి

» ఎంపీ వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కౌలు రైతులకు నూరుశాతం పంట రుణాలు మంజూరు చేసేందుకు గ్రామాల వారీగా సర్వే నిర్వహించాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. జిల్లాలో కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులు, మత్స్యకారులు, పాడిరైతులు, గొర్రెల, మేకల పెంపకం దారులకు ఇతోధికంగా రుణాలు మంజూరు చేయాలన్నారు. వచ్చే జూన్, జులైలోగా జిల్లాలో కనీసం 25వేల మందికిపైగా కౌలురైతులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. వచ్చే సమావేశం నాటికి పశుసంవర్ధక మత్స్యశాఖ అధికారులు ఎంతమందికి రుణాలు మంజూరు చేయించారో సమావేశంలో వివరించాలన్నారు. ఏడాదిన్నరలో బందరుపోర్టు రానుందనీ, తద్వారా ఈ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్స్ వంటివి ఎక్కువగా వస్తాయని, రుణాలకు డిమాండ్ బాగా పెరుతుందన్నారు. విశాఖపట్నం, కృష్ణపట్నం ఓడరేవులకు వెళ్లి అధ్యయనం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులకు ఎంపీ సూచించారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

వ్యవసాయ ఆధారిత జిల్లా కావటంతో, జిల్లాలో రైతాంగం, ప్రోత్సాహక పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాల ద్వారా ఎక్కువగా లబ్ధిపొందేలా చూడాల్సిన అవసరం ఉందని కలెక్టర్ బాలాజీ అన్నారు. జిల్లాలో కౌలు రైతులకు 77వేలకు పైగా సీసీఆర్సీ కార్డులు జారీచేసినప్పటికీ పంట రుణాల మంజూరుకు గ్రామాలవారీగా సర్వే నిర్వహించాలన్నారు. సమస్యలు అధిగమించి కౌలు రైతులకు నూరుశాతం పంట రుణాలు మంజూరు చేయాన్నారు. పంట రుణాలు తీసుకున్న వారందరికీ పంటల బీమా వర్తింపచేసేందుకు బ్యాంకర్లు కృషిచేయాలన్నారు. జిల్లాలో వివిధ పంట విస్తీర్ణం, పంట దిగుబడి అంచనాలు, రైతులకు సాగు వ్యయం అంశాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు ఎకరాకు మంజూరుచేసే పంటరుణాలు మొత్తం (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) స్టేట్ కమిటీకి నివేదించే నిమిత్తం కమిటీలో చర్చించారు. అనంతరం రిజర్వ్ బ్యాంకు సైబర్ ఆర్థిక నేరాలపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ సి.రవీంద్రారెడ్డి, ఆర్‌బీఐ ఎల్డీవో నవీన్‌కుమార్, నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ మిలింద్ చోస్కాలర్, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉప ప్రాంతీయ నిర్వహణ అధికారి తాతాజీ, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావ్, టిడ్కో పీడీ బి.చిన్నోడు, ఉద్యాన శాఖ అధికారి జె.జ్యోతి, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పేదరికపు పరుగులో కుప్పకూలీ..

(5వ పేజీ తరువాయి)

కొంతదూరం పరుగు తీసిన చంద్రశేఖర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న వైద్యసిబ్బంది యువకుడిని హుటాహుటిన అంబులెన్స్‌లో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చంద్రశేఖర్ డబ్ల్యూబీసీ కౌంట్ 30 వేలకు చేరిందని, దీంతో పాటు ఐదు రోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతున్నాడని వైద్యులు తెలిపారు. ఉద్యోగం సాధించి ఇంటికి వస్తాడనుకున్న కుమారుడు మృత్యురూపంతో రావడంతో ఆ కుటుంబం కన్నీటిలో మునిగిపోయింది. చేతికి అంది వచ్చిన కొడుకు కుటుంబ మృతి చెందడంతో తల్లి మణి రోదన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

అంతా అక్రమమే!

(5వ పేజీ తరువాయి)


పెట్టుకున్నారు. వాటి నుంచి మట్టిని అక్రమంగా తరలించి గోడౌన్‌ల నిర్మాణం చేసిన ప్రాంతాన్ని మెరకచేశారు. తమ భూములను ఆక్రమించేసుకున్నారని, మట్టిని అక్రమంగా తరలించేశారని అప్పట్లో బాధితులు పోలీసులకు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. అయితే పేర్ని నాని అప్పట్లో మంత్రిగా ఉండటంతో అధికారులు విచారణ చేసినా, మట్టి తవ్వకాలను నిలిపివేయలేకపోయారు. అప్పట్లో పొట్లపాలెం, బుద్దాలపాలెం పరిసర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలపై అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. మంత్రిగా ఉన్న పేర్ని నాని అధికారులను తన చెప్పు చేతల్లో పెట్టుకుని తన మనుషుల ద్వారా మట్టి తవ్వకాలను కొనసాగించారు.

పేర్ని నానికి ఉప్పందించేది ఎవరు

గత నెలరోజులుగా పేర్ని నాని గోడౌన్‌లకు సంబంధించిన వ్యవహారంలో పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు విచారణ చేస్తున్నారు. పేర్ని నాని గోడౌన్‌లో నుంచి 7,577 బస్తాల బియ్యం మాయమైనట్టు అధికారులు తేల్చారు. ఈ ఘటనలో గోడౌన్ యజమాని పేర్ని జయసుధ, మేనేజర్, పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్, ఒకమిల్లు యజమాని, లారీ డ్రైవర్‌తో పాటు ఏ-6గా పేర్ని నానిపైనా కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలు, కేసులు పెడితే జరిగే పరిణామాలు, ఎలా తప్పించుకోవచ్చనే అంశంపైన పూర్తిస్థాయి వివరాలను పోలీస్ విభాగంలోని ఒక బ్రాంచ్ నుంచి పేర్ని నానికి చేరవేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

నిందితులను పోలీస్ కస్టడీకి కోరిన పోలీసులు

మాజీ మంత్రి పేర్ని నానికి చెందిన గోడౌన్‌ల నుంచి బియ్యం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితులను పోలీసులు తమ కస్టడీకి ఇవ్వాలని గురువారం కోర్టును ఆశ్రయించారు. గోడౌన్ మేనేజర్ మానసతేజ, పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, పెడన మండలం నందిగామకు చెందిన మిల్లు యజమాని బొర్రా ఆంజనేయులు, బంటుమిల్లి మండలం పెనుమల్లికి చెందిన లారీ డ్రైవర్ బోట్ల మంగారావును పోలీసులు గత నెల 30వ తేదీన అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. వీరు బెయిల్ కోసం గురువారం పిటిషన్‌లను వేశారు. ఈ నేపథ్యంలో ఈ నలుగురిని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు.



కుసుమకుమారికి పంట నష్టపరిహారం వివరాలు

పరిహారం కొల్లగొట్టారు!

(5వ పేజీ తరువాయి)

యజమాని భాస్కరరావుకు, ఆయన కోడలి బ్యాంకు ఖాతాల్లో రూ.96 వేల పంటల నష్టపరిహారం జమవేయటంలో మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావుదే బాధ్యతని వారు చెప్పిన విషయం తెలిసిందే. ఇంకా అనర్హుల పేర్లు, కొందరు రాజకీయ నేతల అవినీతి కూడా పంటల నష్టపరిహారంలో బయట పడుతోంది. పంటల నష్టపరిహారం అవినీతి వార్తలు రాయొద్దని అనేకమంది వత్తిడి చేయటం చూస్తే అందరు ఈ పాపంలో పాలుపంచుకున్నట్టు తెలుస్తోంది.

నేను నష్టపోతే చనిపోయిన మహిళలకు పరిహారం

- లోయ మల్లికార్జునరావు, తోట్లవల్లూరు, కౌలురైతు

గుంటక రాజరాజేశ్వరికి చెందిన భూములను కౌలుకు సాగుచేశా. ఈమె 2023 నవంబర్ 1వ తేదీన మరణించారు. అయితే నాకు రావాల్సిన పంటల నష్టపరిహారాన్ని రాజరాజేశ్వరి అకౌంట్లో వేశారు. ఆమె డెత్ సర్టిఫికెట్‌ను అధికారులకు ఇచ్చినా నిర్లక్ష్యం చేశారు. 80 సెంట్లు పసుపు, 71 సెంట్లు అరటి పంట పరిహారం చనిపోయిన మహిళ అకౌంట్లో వేయడంతో నాకు నష్టం జరిగింది.

జిల్లాలో హత్యల కలకలం!

» న్యూ ఇయర్ వేడుకల్లో ఇద్దరి హత్య

» మద్యం మత్తులో పొడిచి చంపేసిన దుండగులు

విజయవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సమయంలో ఒక రోజు వేర్వేరు చోట్ల జరిగిన రెండు హత్యలు తీవ్ర కలకలం రేపాయి. రామవరప్పాడు శ్మశానవాటిక వద్ద తాపీమేస్త్రిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన వైకుంఠం(30) ఉపాధి కోసం విజయవాడ వచ్చి భార్య, ఇద్దరు పిల్లలు, బంధువులతో కలిసి రామవరప్పాడు కొత్తవంతెన సమీపాన పటేల్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి దుకాణం వద్ద ఇతరులతో గొడవ పడుతుండగా బంధువులు అతడ్ని ఇంటికి తీసుకెళ్లారు. తర్వాత కాసేపటికి మళ్లీ బయటకు వచ్చాడు. పటేల్‌నగర్‌లో ఉన్న శ్మశానం వద్ద రహదారిపై వైకుంఠం రక్తపు మడుగులో పడిఉండగా బంధువులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్ కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్య వెనుక ఓ రౌడీషీటర్ పాత్ర ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వైకుంఠంతో రౌడీషీటర్‌కు ఉన్న పాత వివాదాల నేపథ్యంలో గానీ, మద్యం మత్తులో జరిగిన ఘర్షణ వల్ల గానీ హత్య జరిగి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

తెల్లదేవరపల్లిలో యువకుడు..



రాంబాబు (ఫైల్‌ఫొటో)

విస్సన్నపేట : తెల్లదేవరపల్లి దళితవాడలో బుధవారం రాత్రి ట్రాక్టర్ డ్రైవర్ కారుమంచి రాంబాబు (27) హత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన విసంపల్లి సతీష్ పదునైన ఆయుధంతో కడుపులో పొడిచి రాంబాబును హత్య చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంబాబు, సతీష్‌ల మధ్య బుధవారం ఘర్షణ జరగ్గా రాంబాబును పొడిచి గాయపరిచాడు. రాంబాబుకు తీవ్ర రక్తస్రావం అవడంతో అతడ్ని బంధువులు 108లో విస్సన్నపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సీఐ గిరిబాబు, ఎస్సై జి.రామకృష్ణలు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. గురువారం మృతదేహాన్ని స్వగ్రామం తెల్లదేవరపల్లికి తరలిస్తు నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుని బంధువులు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

అవనిగడ్డ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతంగా పని చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ విజయవాడ జోన్ ఏడీ జి.విజయరత్నం అన్నారు. అవనిగడ్డ డిపోను గురువారం ఆయన సందర్శించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కారం చేస్తామని, ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. ఉత్తమ సేవలందించిన కార్మికులకు ప్రశంసాపత్రాలు అందించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తులు

భారతీనగర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే స్వల్పకాల వ్యవధి కోర్సుల్లో శిక్షణకు ఈనెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని స్కిల్ సెంటర్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుకు మూడు నెలల శిక్షణ ఇస్తామని, ఈ కోర్సుకు ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ, సౌకర్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. 8, 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమో, ఆపైన చదివిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 99857 59304, 83282 52829కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.



మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పేదలకు కుట్టుమిషన్లు అందించడం అభినందనీయం

ప్రసాదంపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థిక ఊతమిచ్చేలా ఒక్కొక్కటి రూ.35 వేలు విలువైన హైస్పీడ్ కమర్షియల్ కుట్టుమిషన్లను 27 మందికి కోల్ ఇండియా చైర్మన్ పోలవరపు ప్రసాద్ అందించడం అభినందనీయమని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం ఆధ్వర్యంలో గురువారం ప్రసాదంపాడులోని టీడీపీ కార్యాలయంలో 27 కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. సీఎస్ఆర్ నిధులందించిన పోలవరపు ప్రసాద్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎనికేపాడులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం ఎదురుగా ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిలో హైటెక్స్ లాంటి కన్వెన్షన్ సెంటర్, గదుల నిర్మాణం ఆవశ్యకతను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎనికేపాడులోని ఎన్టీఆర్ విగ్రహం వెనుక ఉన్న ఇరిగేషన్ స్థలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు నిధులు కేటాయించాలని సీఈవో శివశంకర్‌ను కోరామన్నారు. స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ సీఈవో శివశంకర్, ప్రోగ్రాం చైర్మన్ రావూరి సుబ్బారావు, రోటరీ క్లబ్ నిర్వాహకులు టీఎస్ఆర్‌కే ప్రసాద్, జీవీ రవిబాబు, విజయభూషణ్‌కుమార్, గన్నె వెంకట్రావు, సీతారామారావు, సురేష్‌బాబు, గొడ్డళ్ల చిన్న రామారావు, సర్నాల బాలాజీ, కొల్లా ఆనంద్, దాసరి మహేష్, గూడవల్లి నరసింహారావు, గుజ్జర్లపూడి బాబూరావు, కోనేరు సందీప్, సాంబూ పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్ డైరెక్టరుగా తాతపూడి గణేష్



రజక కార్పొరేషన్ డైరెక్టరుగా ప్రమాణం చేస్తున్న తాతపూడి గణేష్

పెనమలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా తాతపూడి గణేష్ గురువారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. గురువారం గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏపీ రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, మరో 15మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్‌గా నియమితులైన తాతపూడి గణేష్‌ను పెనమలూరుకు చెందిన కూటమి నేతలు అభినందించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ రామారావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి పాల్గొన్నారు.

హెల్మెట్ పెట్టుకోకపోతే రూ.వెయ్యి జరిమానా



ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించేలా తాడిగడప సెంటరులో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకట్

పెనమలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'ద్విచక్రవాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోతే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తాం. మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తాం. బైక్ నడిపే వ్యక్తి, వెనుక కూర్చున్న నాలుగేళ్ల వయస్సు పైబడిన వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.' అని ట్రాఫిక్ సీఐ వెంకట్ సూచించారు. గురువారం సీఐ నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు తాడిగడప సెంటరులో హెల్మెట్ ధరించకపోతే జరిగే ప్రమాదాలు, ప్రభుత్వ చర్యలను వివరించే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

పవర్ లిఫ్టర్ ప్రభుకిరణ్‌కు వెండి పతకం



ప్రభుకిరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివకుమార్, ఏవో మురళీకృష్ణ

ఉయ్యూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మైలవరంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో 285 కేజీల విభాగంలో కలవపాముల శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ సంవత్సరం ఏఐఎంఎల్ బ్రాంచి విద్యార్థి పెద్ది ప్రభుకిరణ్ ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించాడు. ప్రభుకిరణ్‌ను బుధవారం కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సూరపనేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, ఏవో పసలపూడి మురళీకృష్ణ అభినందించారు.

చెరకు రైతులకు మొదటి విడత నగదు చెల్లింపు



చెరకు రైతులకు నగదు అందజేస్తున్న కేసీపీ కర్మాగార యూనిట్ హెడ్ సీతారామదాస్

ఉయ్యూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కేసీపీ చక్కెర కర్మాగారానికి ప్రస్తుత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు టన్నుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.3,151 చొప్పున చెల్లించినట్టు కర్మాగార యూనిట్ హెడ్ వై.సీతారామదాస్ గురువారం తెలిపారు. కర్మాగారానికి డిసెంబరు 25 వరకు చెరకు సరఫరాచేసిన రైతులకు 14రోజుల్లో మొదటి విడతగా సొమ్ము చెల్లించామని రానున్న సీజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో చెరకు సాగు చేసి కర్మాగార యాజమాన్యానికి రైతులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, కేసీపీ కేన్ జీఎం వీవీ పున్నారావు, డీజీఎం ఫైనాన్స్ ఎస్.సంపత్‌కుమార్, ప్రాసెస్ మేనేజర్ ఆర్.నరేంద్రకుమార్, రైతు సంఘ నాయకులు ఎస్.వి.కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

54 వెరైటీల స్వీట్లు, 21 రకాల పండ్లతో

గోదాదేవికి సారె

గన్నవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దావాజీగూడెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా గురువారం గోదాదేవి అమ్మవారికి భక్తులు సారెను సమర్పించారు. 54 రకాల స్వీట్లు, 21 రకాల పండ్లను నైవేద్యంగా భక్తులు సమర్పించారు. ఆలయ అర్చకుడు ఎన్. రామాచార్యులు తొలుత విష్వక్సేన పూజ పుణ్యాహవచనం చేశారు. 60 కేజీల తులసీ దళాలతో సహస్రనామావళి అష్టోత్తరలతో అమ్మవారికి విశేష అర్చన జరిపారు. 500 మంది సువాసినీలతో కుంకుమ పూజ నిర్వహించారు. 11 రకాల పూలతో గోదాదేవి సమేత శ్రీకృష్ణస్వామిని విశేషంగా అలంకరించారు. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, గన్నవరం, విజయవాడ, కేసరపల్లి, ఉయ్యూరు, గుడివాడ ప్రాంతాలకు చెందిన చినజీయర్ స్వామి భక్తులు పాల్గొన్నారు.



దావాజీగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన సారె

టీడీపీకి వెన్నెముక బీసీలే

● పార్టీ ఆవిర్భావం నుంచి అండగా నిలుస్తున్నారు: ఎమ్మెల్యే బోడె ప్రసాద్



సంగెపు రంగారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీకి వెన్నెముక బీసీలేనని, పార్టీ ఆవిర్భావం నుంచి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సంగెపు రంగారావు 74వ జన్మదిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. టీడీపీలో బీసీలకు సముచిత స్థానం ఎప్పుడూ ఉంటుందన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో బీసీల నాయకుడిగా గుర్తింపు పొందిన సంగెపు రంగారావు 74 వసంతాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఆయన అందించిన సేవలు మరువలేమన్నారు. నియోజకవర్గ బీసీ నాయకులు, అనుమోలు ప్రభాకరరావు తదితరులు సంగెపు రంగారావును సన్మానించారు. శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్, వీరంకి కుటుంబరావు, కొణతం సుబ్రహ్మణ్యం, ఆచంట వెంకటచంద్ర, కొమ్మినేని వెంకటేష్, మసనం శ్రీనివాస్, సలీం, ఇంటూరి మురళి, బొంగరాల అబ్రహం, వంగూరు పవన్, రావి రాకేష్, వణుకూరు నాగేశ్వరరావు, అన్నవరపు శివపార్వతి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: 2019కు ముందు టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభమై, వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన కానూరు ఎనభై అడుగుల రోడ్డు లాంటి ప్రధాన మార్గాల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గురువారం తాడిగడప మునిసిపల్ అధికారులు, సీఆర్డీయే అధికారులతో కలిసి కానూరులో నిర్మాణం పూర్తికాని ఎనభై అడుగుల రోడ్డును ఆయన పరిశీలించారు. బందరు రోడ్డుకు సమాంతరంగా సనత్‌నగర్ నుంచి మహదేవపురం కాలనీ మీదుగా గతంలో ఎనభై అడుగుల రోడ్డును కొంత మేర నిర్మించామని, తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చి ఆ రోడ్డు పనులను నిలిపివేసిందని ఆయన పేర్కొన్నారు. బందరు రోడ్డుపై ట్రాఫిక్ భారాన్ని మరింత తగ్గించేందుకు పంటకాల్వ రోడ్డు, ఎనభై అడుగుల రోడ్డులాంటి రోడ్లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇటీవల పంటకాల్వ రోడ్డుపై వీఆర్ సిద్ధార్థ కళాశాల వైపం తెన ప్రారంభించడంతో బందరు రోడ్డుపై ట్రాఫిక్‌ను కొంతమేర నియంత్రించగలిగామని తెలిపారు. త్వరలో పెండింగ్ రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలతో ముందుకు వస్తామని తెలిపారు. సీఆర్డీయే ఎస్ఈ భాస్కర్, ఈఈ హనుమంతరెడ్డి, డీఈ రవికుమార్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

ధర్నాచౌక్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అంబాపురం మన్నా చర్చి పాస్టర్ చందోలు మోషే ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెస్సార్ డవలపర్స్ అధినేత మాధవరపు శ్రీనివాసరావు, అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య రాష్ట్ర ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చర్చి పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీతకు

వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం



గుడివాడ మాంటిస్సోరి స్కూల్‌లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

గుడివాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు(సైన్స్ ఫెయిర్లు) దోహదం చేస్తాయని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. గురువారం మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనను గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. మాంటిస్సోరి, ఏకేటీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ జాకీర్ ప్రదర్శనల వివరాలను ప్రకటించారు. గుడివాడ డీవైఈవో ఐ. పద్మారాణి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి షేక్ జాన్ సాహెబ్, టీడీపీ నాయకుడు పెద్దు శ్రీకాంత్, జిల్లాలోని 25 మండలాల ఎంఈవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం హైస్కూల్ విద్యార్థినికి ప్రథమ స్థానం

విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.హన్సిక ఫణిదేవి ప్రదర్శించిన 'ఫింగర్ ప్రింట్ బేస్డ్ వెహికిల్ స్టార్టర్‌'కు ప్రథమ స్థానం, పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.వి.ఎస్.మౌనీష్ ప్రదర్శించిన 'స్మార్ట్ ప్యాడీ షెల్టర్ 2.0'కు ద్వితీయస్థానం లభించింది. గ్రూపు విభాగం(ఉపాధ్యాయులు, విద్యార్థి)లో పెడన బీజీకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కె.లక్ష్మీదేవి పర్యవేక్షణలో వై.కె.జానుశ్రీ, కె.హేమశ్రీ ప్రదర్శించిన 'స్మార్ట్ కల్టివేషన్‌'కు ప్రథమ, నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కె.ఉదయ్‌కుమార్ పర్యవేక్షణలో పి.సౌజన్య, ఎ.జీవన ప్రదర్శించిన 'ఫార్ట్ ఫైర్‌రే'కు ద్వితీయ స్థానం లభించింది. మూడు విభాగాల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ప్రదర్శనలు రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపికయ్యాయి.

ఉపాధ్యాయుల విభాగంలో..

కంచడం హైస్కూల్ హెచ్‌ఎంకు ప్రథమ స్థానం

ఉపాధ్యాయుల విభాగంలో కంచడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు ప్రదర్శించిన 'స్మార్ట్ డివైస్ టు స్టాప్ సూసైడ్స్‌'కు ప్రథమ స్థానం, తోట్లవల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టి.ఫణిరాజమోహన్ ప్రదర్శించిన 'మ్యాథమెటికల్ టీచింగ్ ఎయిడ్స్‌'కు ద్వితీయ స్థానం లభించాయి.



బాపులపాడు శివాలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

శివాలయంలో కుంకుమ పూజ

హనుమాన్‌జంక్షన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బాపులపాడు బ్రహ్మసూత్ర భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానంలో గురువారం మండల పూజా కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. మరకత లింగానికి మహాన్యాస పూర్వక మహా మృత్యుంజయ పాశుపతాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన హోమాలు, మహాపూర్ణాహుతి, శిఖరానికి కుంభాభిషేకం కార్యక్రమాలను అర్చకుడు మహేశ్ నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ నిర్వహించి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కుంకుమ పూజ, అభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్, వీరమాచనేని నాగయ్య పర్యవేక్షించారు.

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

బాపులపాడులోని షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. మందిరం అభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లి వెంకట్రావు పాల్గొన్నారు.



కేసరపల్లిలో జాస్తి బసవరావు స్థూపం వద్ద మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు

పోరాట యోధుడు జాస్తి బసవరావు

గన్నవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రజల శ్రేయస్సు కోసం అనునిత్యం తపిస్తూ, విద్యార్థి దశలోనే ఎర్ర జెండా పట్టుకుని పేదల పక్షాన పోరాటం చేసిన యోధుడు జాస్తి బసవరావు అని మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. కేసరపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో అమరవీరుడు జాస్తి బసవరావు వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన స్థూపానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు మాట్లాడుతూ అగ్రవర్ణ, ధనిక రైతు కుటుంబంలో పుట్టినా అనునిత్యం పేదల పక్షాన నిలిచారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, మల్లంపల్లి ఆంజనేయులు, సంకాబత్తుల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అష్టలక్ష్మీ ఆలయ శిఖర

పునఃప్రతిష్ఠా మహాయాగ మహోత్సవాలు

గుడివాడ రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చిన ఎరుకపాడులో అష్టలక్ష్మీ ఆలయాన్ని నిర్మించి పన్నెండేళ్లు పూర్తైన సందర్భంగా ఈనెల 3వ తేదీ(శుక్రవారం) నుంచి 6వ తేదీ(సోమవారం) వరకు ఆలయ శిఖర పునఃప్రతిష్ఠా మహాయాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, 6వ తేదీన గణపతి సచ్చిదానంద స్వామీజీ(అప్పాజీ) విచ్చేస్తున్నారని ఆలయ ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సంప్రోక్షణ యాగాన్ని ప్రారంభించి, గణపతి పూజ, అఖండ దీపారాధన, సాయంత్రం 6.30 గంటలకు సహస్ర నామార్చన, శ్రీ సూక్త మంత్రయాగం నిర్వహిస్తారని తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు గణపతి వందనం, ఆంజనేయ హోమం, మూలమంత్ర హోమం, సాయంత్రం 5 గంటలకు ఆంజనేయ సహస్రనామార్చన, ఆదివారం దీక్షా హోమం, మండల దేవతా హోమం, నవగ్రహ దేవతాహోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు గణపతి సచ్చిదానంద స్వామీజీ విచ్చేశాక మహాసంప్రోక్షణ, ఆలయ శిఖర పునఃప్రతిష్ఠా మహోత్సవం, ఉదయం 11 గంటలకు హరిప్రియ రాగ సాగర నాద చికిత్సకచేరి నిర్వహిస్తారని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

ఉయ్యూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏజీ అండ్ ఎస్జీ కళాశాల కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, దివీస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) పూర్తిచేసిన వారికి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ తెలిపారు. బయోడేటా, బీఎస్సీ, ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని, వివరాలకు ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ ఏఎన్ శ్రీనివాసరావును 95535 39203 సంప్రదించాలని ఆయన సూచించారు.



సంక్రాంతి పండుగకు భారీగా ఆర్టీసీ బస్సులు, రైళ్లు

● ఈ సారి 19 వరకు సెలవులు ● రికార్డు స్థాయిలో 1500 బస్సులు నడపాలని ఆర్టీసీ అంచనా ● సంక్రాంతి స్పెషల్ రైళ్లను ప్రకటించిన రైల్వే

ఆంధ్రజ్యోతి, విజయవాడ: తెలుగు లోగిళ్లలో అతి పెద్ద పర్వదినం 'సంక్రాంతి'కి ప్రయాణాల జాతర మోగబోతోంది! ఈసారి జనవరి 19 వరకు ప్రభుత్వం సెలవు దినాలను ప్రకటించడంతో భారీగా ప్రయాణ అంచనాలు నెలకొన్నాయి. ఈ సంక్రాంతికి కిందటేడాది కంటే రికార్డు స్థాయిలో ప్రయాణాలు జరిగే పరిస్థితి ఉండటంతో ఆర్టీసీ ముందస్తుగా సన్నాహకాలు చేస్తోంది. కిందటేడాది 1100 బస్సులకు ప్లానింగ్ చేస్తే 1310 బస్సులను ఆర్టీసీ తిప్పింది. ఈ ఏడాది మరిన్ని సెలవులను దృష్టిలో ఉంచుకుని చూస్తే ఎక్కువ ప్రయాణాలుంటాయన్న అంచనాతో 1500 వరకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అధికారికంగా మరో రెండు రోజుల్లో పండగ స్పెషల్స్‌ను అధికారులు ప్రకటించబోతున్నారు. సొంతూళ్లకు వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో పండగకు ముందు హైదరాబాద్ నుంచి వచ్చేవారి కోసమే సగం బస్సులను రిజర్వు చేయాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులు చాలకపోవటంతో కిందటి సారి ఎక్కువగా కార్లు, సొంత వాహనాల్లో భారీగా తరలివచ్చారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు హైదరాబాద్‌కు వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపాలని భావిస్తున్నారు. పండగ రాక ప్రయాణాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఈసారి మూడొంతులకు పైగా బస్సులను హైదరాబాద్‌కు పంపించాలన్న ఆలోచనను ముందుగా చేశారు. విజయవాడ నుంచి ఇతర దూర ప్రాంతాలకు కూడా వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో ఆ తర్వాత సగం బస్సులనే హైదరాబాద్‌కు పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. చెన్నై, బెంగళూరు నుంచి గతంలో మాదిరిగా ప్రయాణాలు ఉండటం లేదు. నెల, రెండు నెలల ముందుగానే అక్కడ పనిచేస్తున్న మన టెకీలు ఫ్లైట్స్‌లో టిక్కెట్ బుక్ చేసుకుంటున్నారు. పండగ సమయంలో బస్సులో వచ్చినా, ఫ్లైట్స్‌లో వచ్చినా ఇంచుమించు ఒకేధర ఉండటంతో చెన్నై, బెంగళూరు ప్రయాణికులు ఫ్లైట్స్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. 2, 3 నెలల ముందుగా వారు ఫ్లైట్స్ టికెట్స్ బుక్ చేసుకుంటే డైనమిక్ ఫేర్‌తో (చివర్లో రేట్లు పెంచుకునే పద్ధతి) ప్రకారం టిక్కెట్ల ఛార్జీ తగ్గుతుంది. దీంతో తక్కువ ధరకు వెళ్లిపోవచ్చన్న ఉద్దేశంతో ఆర్టీసీ బస్సులను ఆదరించటం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు చెన్నై, బెంగళూరుకు మరీ భారీగా బస్సులు నడపటానికి అయితే ప్లాన్ చేయలేదు. ఆర్టీసీ అధికారుల లక్ష్యమంతా హైదరాబాద్‌పైనే ఉంది. హైదరాబాద్ నుంచి పండగకు వచ్చే వారి కోసం 700 స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించారు. మిగిలిన రూట్లకు సంబంధించి చూస్తే బెంగళూరుకు 40 బస్సులు, చెన్నైకు 40, రాజమండ్రికి 300 బస్సులు, విశాఖపట్నం 150 బస్సులు ఇతర ప్రాంతాలకు 150 బస్సులు నడపాలని భావిస్తున్నారు. ఈ సారి సెలవులు ఎక్కువగా ఉండటంతో కుటుంబ సమేతంగా తిరుపతి వంటి పుణ్య క్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఉందన్న ఉద్దేశంతో తిరుపతికి 10 ప్రత్యేక బస్సులు, అవసరాన్ని బట్టి రిజర్వు బస్సులను కూడా సిద్ధం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణ - ఆంధ్ర.. ఆరు ప్రత్యేక రైళ్లను ప్రకటించిన రైల్వే

తెలంగాణా రాష్ట్రం నుంచి ఏపీకి పండగ ప్రయాణాలు సాగించే వారి కోసం రైల్వే శాఖ కూడా స్పెషల్ ఆపరేషన్‌ను ప్రారంభిస్తోంది. ఈ మార్గంలో మొత్తం 6 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు గురువారం ప్రకటించింది. కాచిగూడ - కాకినాడ టౌన్ (07653) రెండు రైళ్లు, కాకినాడ టౌన్ - కాచిగూడ (07654) 2 రైళ్లు, హైదరాబాద్ - కాకినాడ టౌన్ (07023), కాకినాడ టౌన్ - హైదరాబాద్ (07024) మధ్యన మరో రెండు రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు.


రిబ్బన్ కట్ చేసి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, చిత్రంలో ఎంపీ బాలశౌరి, కొల్లు రవీంద్ర తదితరులు

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వాహనం


● ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

మచిలీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముందస్తుగా కేన్సర్ గుర్తించి మరణాలు తగ్గించే లక్ష్యంతో జిల్లాలో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే వాహనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన జిల్లాలో ఉచిత కేన్సర్ నిర్ధారణ జరిపే వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) రూ.2 కోట్ల వ్యయంతో ఈ వాహనాన్ని సమకూర్చడం ముదావహమన్నారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కేటాయించిన తేదీల్లో ఈ వాహనం తిరుగుతుందన్నారు. ముందస్తుగానే కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తే జిల్లాలో ఏడాదికి 40వేల కేన్సర్ రోగుల మరణాలను నివారించే అవకాశం ఉంటుందని బాలశౌరి తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర, మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము, కలెక్టర్ బాలాజీ, మెడికల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన నేతలు పాల్గొన్నారు.


మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామచంద్ర మోహన్, అర్చకులు

దేవదాయ శాఖ మంత్రికి దుర్గమ్మ ఆశీస్సులు

వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి నూతన సంవత్సరం సందర్భంగా దుర్గగుడి తరఫున ఆశీస్సులు అందజేశారు. గురువారం రామ నారాయణ రెడ్డిని ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్, అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ పి.వి.ఆర్. శేఖర్, డిప్యూటీ ఈవో రత్నరాజు, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి, తదితరులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలపటంతో పాటు దుర్గమ్మ ఆశీస్సులను అందజేశారు. అనంతరం ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం, దుర్గమ్మ చిత్రపటం ఇచ్చారు.


ఉపాధ్యాయ సంఘం డెమోక్రటిక్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

డెమోక్రటిక్ పీఆర్‌టీయూ క్యాలెండర్ సీఎం ఆవిష్కరణ

గవర్నర్‌పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ పీఆర్‌టీయూ (ఏపీ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను, ప్రధాన కార్యదర్శి ఈ వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్టు సంఘం నేతలు తెలిపారు.

సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

● ప్రభుత్వం సానుకూల స్పందన
● ఎన్జీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్

కృష్ణలంక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చామని, ఆయన సానుకూలంగా స్పందించడంతో కొత్త సంవత్సరంలో సమస్యలు పరిష్కరిస్తారనే ఆశాభావంతో ఉన్నామని ఏపీ ఎన్జీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏపీ ఎన్జీవో నగర శాఖ రూపొందించిన 2025 క్యాలెండర్‌ను గురువారం ఎన్జీఓ హోంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఉద్యోగుల సమస్యలను వినతిపత్రం ద్వారా ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని తెలిపారన్నారు.

స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలో (ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లా) ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు పోస్టులను ఒక ఏడాది కాలపరిమితితో కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ పద్మా శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 17 వరకూ సాయంత్రం 5 గంటల్లోగా రాజమహేంద్రవరంలోని వైద్యారోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు సీఎఫ్ డబ్ల్యు.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. గతంలో నోటిఫికేషన్ నెం.5/2022, 1-12-2022న కానీ, 1/2023, 20-09-2023 తేదీన కానీ ఇది వరకే నియమితులై పనిచేస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అనర్హులని, వారి దరఖాస్తులు తిరస్కరించడం జరుగుతుందన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

ఉయ్యూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఉయ్యూరు రూరల్ ఎస్సై కె. సురేశ్‌బాబు తెలిపారు. ఆకునూరు ఎస్సీ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన ఎన్.సుబ్రహ్మణ్యం కొన్నిరోజులుగా వెంట పడుతున్నాడు. బుధవారం రాత్రి బంధువుల ఇంటికి వెళుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించడం చూసిన ఆమె బంధువులు అక్కడికి చేరుకోగా పారిపోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పొగమంచు వల్ల విమాన రాకపోకలు ఆలస్యం

గన్నవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా విమాన రాకపోకలు ఆలస్యంగా నడిచాయి. గురువారం తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు పడటంతో విమానాశ్రయంలో ల్యాండింగ్ అవాల్సిన విమానాలకు విజిబులిటీ లేక గంటల తరబడి గాల్లోనే చెక్కర్లు కొట్టాయి. ప్రతిరోజు ఉదయం ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. పొగమంచుతో ఒక్కో విమానం గంట నుంచి గంటన్నరకు పైగా గాలిలో చెక్కర్లు కొట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

4 నుంచి ప్రపంచ నాస్తిక మహాసభలు

● దేశ, విదేశాల ప్రతినిధుల రాక ● డాక్టర్ సమరం వెల్లడి

పటమట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నాస్తిక కేంద్రంలో ఈ నెల 4, 5 తేదీల్లో ప్రపంచ నాస్తిక మహాసభలు జరగబోతున్నాయని, నాస్తిక మహాసభల కన్వీనర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ జీ సమరం తెలిపారు. ఈ మహాసభలను పురస్కరించుకుని గురువారం స్థానిక నాస్తిక కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాస్తికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని, 20 దేశాల్లో 50 శాతానికి పైగా ప్రజలు నాస్తికత్వాన్ని అనుసరిస్తున్నారన్నారు. 4న ప్రారంభమయ్యే నాస్తిక మహాసభల మొదటిరోజు 11 గంటలకు సభ మొదలవుతుందని, తమిళనాడుకు చెందిన ద్రవిడార్ కజగం అధ్యక్షుడు కే వీరమణి సభలను ప్రారంభిస్తారని, ఇందులో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, ఐఏఎస్ అధికారి కామల్‌తౌరీ, డాక్టర్ నరేంద్రకుమార్, డాక్టర్ దేవరాజు మహరాజు పాల్గొంటారన్నారు. రెండో రోజు ఉదయం మహాసభలు యూత్ సమ్మిట్‌గా నిర్వహిస్తామని, యువ సదస్సుని ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫర్మ్ సంస్థాపకులైన డాక్టర్ జయప్రకాష్ నారాయణ ప్రారంభించి యువతకు తన సందేశాన్ని వినిపిస్తారన్నారు. యువ సదస్సులో జరిగే చర్చాగోష్ఠికి ఆయన సమన్వయకర్తగా వ్యవహరిస్తారని, సదస్సులో పాల్గొనే 300కు పైగా యువతను వివిధ గ్రూపులుగా విభజించి ప్రజాస్వామ్య పరిరక్షణ, శాస్త్రీయ దృక్పథం, క్రిటికల్ థింకింగ్, సెక్యులర్ ఆచరణ వంటి విషయాలపై చర్చాగోష్ఠులు నిర్వహిస్తామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, కాన్ఫరెన్స్ డిక్లరేషన్‌ను ప్రకటిస్తారన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో దేశ, విదేశాలకు చెందిన నాస్తికులు, హేతువాదులు, మేధావులు, పలువురు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని సమరం తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో వికాస్ గోరా, నియంత, సకల, రష్మీ పాల్గొన్నారు.


యర్రాజీ జ్యోతితో రాఘవేంద్ర, హైమా

అర్జున అవార్డుకు జ్యోతి ఎంపికపై హర్షం

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన భారత మహిళా అథ్లెట్ యర్రాజీ జ్యోతి అర్జున అవార్డుకు ఎంపిక కావడం తెలుగువారంతా గర్వించదగ్గ విషయమని శాప్ ఛైర్మన్ రవినాయుడు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్‌పై ఆమెకున్న అంకితభావం, పట్టుదల కారణంగా అవార్డుకు ఎంపికవడం జరిగిందని, భవిష్యత్‌లో మరిన్ని లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి యువతకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు.

భారత అథ్లెటిక్ సమాఖ్య అభినందనలు

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని అత్యుత్తమ అథ్లెట్‌గా ఒలింపియన్ యర్రాజీ జ్యోతి అర్జున అవార్డుకు ఎంపిక కావడం నిజంగా సర్వత్రా అభినందనీయమని భారత అథ్లెటిక్ సమాఖ్య సంయుక్త కార్యదర్శి ఆకుల రాఘవేంద్ర, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఆకుల హైమాలు కొనియాడారు. జాతీయ క్రీడల్లో 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.78 సెకన్లలో పూర్తి చేసి రజతం సాధించిందని గుర్తు చేశారు. 13 అంతర్జాతీయ పతకాలు, 22 జాతీయ పతకాలతో ఒలింపిక్స్ ఆడిన ఘనత వహించిందన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన కలెక్టర్

కృష్ణలంక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను గురువారం రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గన్నవరంలో పశుసంవర్ధకశాఖ కార్యాలయం

గన్నవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గన్నవరంలో పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుల కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల విభజనలో కంకిపాడులో ఉండే కార్యాలయాన్ని విజయవాడకు తరలించారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల పశుపోషకులు గుడ్లవల్లేరు వెళ్లాల్సి వచ్చేది. దీంతో కూటమి ప్రభుత్వం ఇటీవల గన్నవరంలో ఉప సంచాలకుల కార్యాలయం ఏర్పాటుకు జీవో నెంబర్-30ను విడుదల చేసింది. అలాగే జిల్లాకు అదనంగా డివిజన్ కార్యాలయం మంజూరు చేసింది. జిల్లాల విభజన తరువాత గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని పశుపోషకులు గుడ్లవల్లేరు వెళ్లేవారు. ప్రభుత్వం గన్నవరంలో ఉపసంచాలకుల కార్యాలయం ఏర్పాటు చేయటంతో ఈ రెండు నియోజకవర్గాల పశుపోషకులకు ఉపయుక్తంగా మారనుంది. ఈ నెల 10లోపు ప్రారంభించాలని, అందుకు తగ్గట్టుగా జిల్లా పశుగణాభివృద్ధి (సెమెన్ బ్యాంకు) భవనంలో కార్యాలయ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. దీనిలో డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, సీనియర్ అసిస్టెంట్-2, డీఈవోస్-2, అటెండర్ -2, నైట్ వాచ్‌మెన్ పోస్టులు రానున్నాయి.

● పనులు పరిశీలించిన రాష్ట్ర సంచాలకుడు డాక్టర్ దామోదర నాయుడు


గన్నవరం సెమెన్ బ్యాంకును పరిశీలించి సూచనలిస్తున్న డాక్టర్ దామోదర నాయుడు

కార్యాలయ ఏర్పాటు పరిశీలన

గన్నవరంలో ఏర్పాటు చేయనున్న పశుసంవర్ధక శాఖ డివిజన్ కార్యాలయ ఏర్పాట్లను గురువారం ఆ శాఖ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ డి.దామోదర నాయుడు పరిశీలించారు. భవనాలను, అక్కడున్న సౌకర్యాలను, వసతులను చూసి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా దామోదర నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఉపసంచాలకుల కార్యాలయానికి నూతన భవనం సమకూర్చే వరకూ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆవరణలోని భవనాలను వినియోగించుకుంటున్నామన్నారు. వాటికి చినచిన్న మరమ్మతులు చేయాల్సి ఉన్నాయని వాటిని పూర్తిచేసి త్వరలోనే సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ గోపీచంద్, పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



థ్యాంక్యూ సీఎం అంటూ హర్షం వ్యక్తం చేస్తున్న ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నేతలు

జాబ్ క్యాలెండర్ ప్రకటనపై హర్షం

వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈనెల 12న జాబ్ క్యాలెండర్ ప్రకటన చేయనుండటంపై గురువారం మంగళగిరిలోని ఏపీపీఎస్సీ కార్యాలయం వద్ద ఏపీ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ థ్యాంక్యూ సీఎం సార్, థ్యాంక్యూ పవన్ కళ్యాణ్ సార్, థ్యాంక్యూ నారా లోకేష్ సార్ అంటూ ప్లకార్డులతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ మాట్లాడుతూ 2022 పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షా ప్రశ్నాపత్రంలో ఉన్న లోపాలకు గ్రేస్ మార్కులు వేయమని వైసీపీ ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా పట్టించుకోకుండా కేసులు పెట్టారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులపై ఉక్కుపాదం మోపిందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని కానిస్టేబుల్ అభ్యర్థులకు తెలంగాణ తరహాలో గ్రేస్ మార్కులు వేసి తదుపరి పరీక్షలకు అనుమతించాలని కోరినట్టు చెప్పారు. గ్రూప్-2, డిప్యూటీ డీఈవో తరహాలో గ్రూప్-1 కూడా ఒక ఉద్యోగానికి వందమందిని ఎంపిక చేసి మరలా ఫలితాలు విడుదల చేయాలన్నారు. ఉద్యోగ వయో పరిమితి జనరల్ అభ్యర్థులకు 48 ఏళ్లకు పెంచాలని కోరారు. జేఏసీ నేతలు కె.శివప్రసాద్, వై.లక్ష్మణరావు, ఎండీ రహమ్‌తున్నీసా, వి.కవిత, దుడ్డు నూకరాజు, పాడితామని నాగరాజు, కె. పెద్దయ్య, ఎం.చంద్రనాయక్, జె.విజయకుమార్ పాల్గొన్నారు.

విజన్-2047 పేరుతో మభ్య పెట్టొద్దు

● సీపీఎం సమాలోచనలో వక్తలు

గవర్నర్‌పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజన్-2047 పేరుతో ప్రభుత్వం ప్రజల్ని భ్రమల్లో ముంచి మబ్బుల్లోకి తీసుకెళుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజన్-2047 అంశంపై గురువారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో సమాలోచన నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి. తులసీదాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విజన్ 2020పై ఇంతవరకు సమీక్ష లేదని, మరోసారి 2047 విజన్ పేరుతో ప్రజలను మోసం చేయడం తప్ప వాటివల్ల రాష్ట్ర ప్రజలకు ప్రయోజనాలు ఏమీ ఉండటం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్మేస్తున్నారని, కొత్తగా పీపీపీ స్థానంలో పీ4 తీసుకొచ్చారని విమర్శించారు. ఇక ముందు అన్నిట్లోనూ ప్రజల భాగస్వామ్యం పేరుతో దోచుకోవడానికి పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ 2047 నాటికి రెండు ట్రిలియన్ల ఎకానమీకి తీసుకువెళతామంటున్నారని, అంటే 23ఏళ్లలో రాష్ట్ర ఎకానమీ 12 రెట్లు పెరగాల్సి ఉందని అది సాధ్యం కాదన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. ప్రభాకరరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


ఆర్టీసీ ఎండీని, ఛైర్మన్‌ను సత్కరిస్తున్న జోనల్ ఛైర్మన్‌లు

ఆర్టీసీ ఛైర్మన్, ఎండీలకు జోనల్ ఛైర్మన్ల శుభాకాంక్షలు

బస్టేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆర్టీసీ భవన్‌లో గురువారం ప్రజా రవాణా సంస్థ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ సంస్థ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును విజయవాడ ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ అప్పలనాయుడు, నెల్లూరు ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్ రెడ్డి, నాయకుడు సీతారామయ్య, తదితరులు నూతన సంవత్సర శభాకాంక్షలు తెలిపారు. ఇదే సమయంలో ఉద్యోగ సంఘాల నేతలు దివ్యాంగులు, కారుణ్య నియామకాలు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఛైర్మన్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.


సదస్సులో మాట్లాడుతున్న కేసరపల్లి సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక

స్ఫూర్తినిచ్చిన జాతీయ సదస్సు

● కేసరపల్లి సర్పంచ్ లక్ష్మీ మౌనిక

గన్నవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంపై జాతీయ స్థాయిలో జరిగిన సదస్సులో మండలంలోని కేసరపల్లి గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక హాజరయ్యారు. మైసూరులో ఇటీవల జరిగిన ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి లక్ష్మీ మౌనిక ఒక్కరినే ఎంపిక చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతీయ సదస్సు ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన సదస్సులో అన్ని రాష్ట్రాల నుంచి మహిళా సర్పంచ్‌లు వచ్చారన్నారు. మహిళా సర్పంచ్‌ల పాలన వ్యవహారాల్లో వారి కుటుంబ పురుషుల జోక్యం నివారించటమే సదస్సు ఉద్దేశమన్నారు. పరిపాలనలో మహిళా సర్పంచ్‌లు స్వేచ్ఛగా పనిచేయటంపై చర్చ జరిగినట్టు చెప్పారు. జాతీయ సదస్సుకు రాష్ట్రం నుంచి తనను ఎంపిక చేసి పంపించిన పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

గుడ్లవల్లేరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ తగిలి మేత తినేందుకు వెళ్లిన రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన కౌతవరంలో జరిగింది. ఒకటో వార్డుకు చెందిన పాడి రైతు పి.నరసింహారావుకు చెందిన రెండు గేదెలు మేత తినేందుకు నిరుపయోగంగా ఉన్న ఇరిగేషన్ క్వార్టర్స్ సమీపానికి వచ్చాయి. గురువారం సాయంత్రం 4 గంటల తర్వాత ఆ గేదెలు మేతమేస్తూ కింద పడి ఉన్న విద్యుత్ లైన్లకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. కొద్ది సమయానికి సమీపంలో నివసించేవారు గమనించారు. బాధితుడు పి.నరసింహారావు ఫిర్యాదు మేరకు గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



కలెక్టర్ డీకే బాలాజీతో మాట్లాడుతున్న వడ్లమన్నాడు రైతు పెన్నేరు ప్రభాకరరావు

పంట రుణం పరిమితిని పెంచండి

● కలెక్టర్ బాలాజీకి వడ్లమన్నాడు రైతు వినతి

గుడ్లవల్లేరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వరి పంటరుణం పరిమితిని పెంచేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీని వడ్లమన్నాడుకు చెందిన రైతు పెన్నేరు ప్రభాకరరావు కోరారు. గురువారం మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందించారు. ప్రస్తుతం వరికి రూ.41,500 పంట రుణ పరిమితి ఉందని, ఖర్చులు పెరిగి ఈ ఏడాది విత్తనం నుంచి నూర్పిడి, కాటా వరకు ఎకరాకు రూ.50 వేల వరకూ ఖర్చయిందని, రుణ పరిమితి పెంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.



వాకర్స్‌కు నడకపై అవగాహన కల్పిస్తున్న వాకర్స్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు

నడకతో అనేక ప్రయోజనాలు

గుడ్లవల్లేరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నడకతో అనేక ప్రయోజనాలున్నాయని, నిత్యం గంట నడిస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని వాకర్స్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు అన్నారు. గురువారం ఎస్ఈఆర్ఎం హైస్కూల్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లో వాకర్స్‌కు నడక వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు శశికళ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ పాల్గొన్నారు.



త్రిపిర్నేని శేషగిరిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ

త్రిపిర్నేని శేషగిరిరావుకు నివాళి

గుడ్లవల్లేరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతిచెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు త్రిపిర్నేని శేషగిరిరావు దేహాన్ని పరిశోధనల కోసం వైద్య కళాశాలకు, నేత్రాలను మరో ఇద్దరికి లోకాన్ని చూసేందుకు దానం చేసిన కుటుంబ సభ్యులు అభినందనీయులని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ అన్నారు. గురువారం శేషగిరిరావు కుమారుడు సుధాకర్, కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. శేషగిరిరావు చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేసి ఉత్తమ ఉపాధ్యాయుడిగా శేషగిరిరావు గుర్తింపు తెచ్చుకొన్నారన్నారు. రంగన్నగూడెం మాజీ సర్పంచ్ మణికృష్ణ పాల్గొన్నారు.



లింగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

ముందు జాగ్రత్త చర్యలతో బూడిద తెగులు నివారణ

గుడివాడ రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మినుము పైరుపై బూడిద తెగులు, పల్లాకు తెగులు ఆశించే అవకాశం ఉందని, తెగులు సోకిన ఆకులను ముందుగానే తొలగిస్తే నివారణకు ఆస్కారం ఉందని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్.రమాదేవి సూచించారు. గురువారం లింగవరం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మినుము పైరులో వచ్చే తెగుళ్ల నివారణ చర్యలపై ఎలాంటి సందేహాలు ఉన్నా రైతుసేవా కేంద్రంలో లేదా ఏవో కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు. ఏవో బి.అనంతలక్ష్మి, ఏఈవో అనిత, రైతులు పాల్గొన్నారు.



శేరిగొల్వేపల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు

రైతులకు మేలు చేసేందుకే రెవెన్యూ సదస్సులు

గుడివాడ రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేయటానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. గురువారం శేరిగొల్వేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. శేరిగొల్వేపల్లి ఆయకట్టు పరిధిలో సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. పేర్ల మార్పులు, చేర్పులు, ఇతర సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ఆర్ఐ నాగబాబు, మాజీ సర్పంచ్ మెరుగుమాల బసవపున్నయ్య, కాటూరి శివాజీ పాల్గొన్నారు.





మొదటి బహుమతి సాధించిన కంచడం ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు, ప్రదర్శన గురించి వివరిస్తున్న విద్యార్థి



విజ్ఞానశాలలను తిలకిస్తున్న విద్యార్థులు

సృజనాత్మకతను వెలికితీసే వైజ్ఞానిక ప్రదర్శనలు

● డీఈవో పీవీజే రామారావు

గుడివాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ ఫెయిర్లు దోహదం చేస్తాయని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. గురువారం మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనను గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావులు ప్రారంభించారు. మాంటిస్సోరి, ఏకేటీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా సైన్స్ అధికారి మహ్మమద్ జాకీర్ ప్రదర్శనల వివరాలను ప్రకటించారు. గుడివాడ డీవైఈవో ఐ.పద్మారాణి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి షేక్ జాన్‌సాహెబ్, టీడీపీ నాయకుడు పెద్దు శ్రీకాంత్, జిల్లాలోని 25మండలాల ఎంఈవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం హైస్కూల్ విద్యార్థిని హన్సిక ఫణిదేవికి ప్రథమ స్థానం

విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.హన్సిక ఫణిదేవి ప్రదర్శించిన 'ఫింగర్ ప్రింట్ బేస్డ్ వెహికిల్ స్టార్టర్'కు ప్రథమ స్థానం, పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.వి.ఎన్.మౌనిష్ ప్రదర్శించిన 'స్మార్ట్ ప్యాడీ షెల్టర్ 2.0"కు ద్వితీయ స్థానం లభించింది. గ్రూపు విభాగం(ఉపాధ్యాయులు, విద్యార్థి)లో పెడన బీజీకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కె.లక్ష్మీదేవి పర్యవేక్షణలో వై.కె.జానుశ్రీ, కె.హేమశ్రీలు ప్రదర్శించిన 'స్మార్ట్ కల్టివేషన్'కు ప్రథమ, నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కె.ఉదయ్‌కుమార్ పర్యవేక్షణలో పి.సౌజన్య, ఎ.జీవన ప్రదర్శించిన 'ఫార్ట్ చైర్‌రే'కు ద్వితీయ స్థానం లభించింది. మూడు విభాగాల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ప్రదర్శనలు రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు ఎంపికయ్యాయి.

ఉపాధ్యాయుల విభాగంలో కంచడం హైస్కూల్ హెచ్‌ఎంకు ప్రథమ స్థానం

ఉపాధ్యాయుల విభాగంలో కంచడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు ప్రదర్శించిన 'స్మార్ట్ డివైస్ టు స్టాప్ సూసైడ్స్'కు ప్రథమ స్థానం, తోట్లవల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు టి.ఫణి రాజమోహన్ ప్రదర్శించిన 'మ్యాథమెటికల్ టీచింగ్ ఎయిడ్స్'కు ద్వితీయ స్థానం లభించాయి.

ఆత్మవిశ్వాసమే ఆయుధం

● కవి సమ్మేళనంలో కవులు

గుడివాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నిరాశ నిస్పృహలను వీడి, ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా మలచుకుని, ఆశావాద దృక్పథంతో కొత్త సంవత్సరంలో ముందుకు వెళదామని పలువురు కవులు పేర్కొన్నారు. గురువారం కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో సాహితీమిత్రులు, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ స్రవంతి కార్యదర్శి లంకా సురేంద్ర అధ్యక్షతన పట్టణ కవుల కవి సమ్మేళనం నిర్వహించారు. గాయని రూప, అవిర్నేని వెంకటేశ్వరరావు దేశభక్తి గీతాలతో సమ్మేళనాన్ని ప్రారంభించారు. పలువురు కవులు తమ కవిత్వాలను వినిపించారు. అనంతరం డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.వి.జి.ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. సాహితీ మిత్రులు కన్వీనర్ వసుధ బసవేశ్వరరావు, మాల్యాద్రి, సీపీఎం నాయకులు ఆర్సీపీ రెడ్డి, సినీ గీత రచయిత జి.మరియపీటర్, పి.వి.ఎస్.రాజకుమారి, యలమర్తి కోటేశ్వరరావు, ఆముదాలపల్లి గోపి, ఆలూరి విజయకుమార్, రాంబాబు, రజిని పాల్గొన్నారు.



డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఆంజనేయులును సత్కరిస్తున్న సాహితీ వేత్తలు

అష్టలక్ష్మీ ఆలయ శిఖర పునఃప్రతిష్ఠా మహాయాగ మహోత్సవాలు నేటి నుంచి

గుడివాడ రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చిన ఎరుకపాడులో అష్టలక్ష్మీ ఆలయాన్ని నిర్మించి పన్నెండేళ్లు పూర్తైన సందర్భంగా ఈనెల 3వ తేదీ(శుక్రవారం) నుంచి 6వ తేదీ(సోమవారం) వరకు ఆలయ శిఖర పునఃప్రతిష్ఠా మహాయాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, 6వ తేదీన గణపతి సచ్చిదానంద స్వామీజీ(అప్పాజీ) విచ్చేస్తున్నారని ఆలయ ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. గురువారం దేవాలయం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సంప్రోక్షణ యాగాన్ని ప్రారంభించి, గణపతి పూజ, అఖండ దీపారాధన, సాయంత్రం 6.30 గంటలకు సహస్ర నామార్చన, శ్రీ సూక్త మంత్ర యాగం నిర్వహిస్తారని తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు గణపతి వందనం, ఆంజనేయ హోమం, మూలమంత్ర హోమం, సాయంత్రం 5 గంటలకు ఆంజనేయ సహస్రనామార్చన, ఆదివారం దీక్షా హోమం, మండల దేవతా హోమం, నవగ్రహ దేవతాహోమం, సాయంత్రం 6 గంటలకు శ్రీ చక్రార్చన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు గణపతి సచ్చిదానంద స్వామీజీ దేవాలయానికి విచ్చేశాక మహాసంప్రోక్షణ, ఆలయ శిఖర పునఃప్రతిష్ఠా మహోత్సవం, ఉదయం 11 గంటలకు హరిప్రియ రాగ సాగర నాద చికిత్సకచేరి నిర్వహిస్తారని తెలిపారు.

కుళాయి ద్వారా కలుషిత నీరు

● అధికారులకు చెప్పినా ఫలితం శూన్యం
● నిడుమోలు బీసీ కాలనీవాసుల ఆవేదన



కూచిపూడి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నిడుమోలు బీసీ కాలనీలో గ్రామ పంచాయతీ కుళాయి ద్వారా కలుషిత, మురుగు నీరు వస్తోందని కాలనీవాసులు సంకుల కోటేశ్వరమ్మ, పెడసనగంటి రంగమ్మ, పామర్తి లక్ష్మి తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కాలనీలో వస్తున్న మురికి నీటిని సీపీఎం నాయకులు పరిశీలించారు. స్థానిక మహిళలతో మాట్లాడారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం మొవ్వ మండల కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్‌చేశారు. ఉప్పలపు వెంకటాద్రి, డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కూచిపూడిలో మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు

కూచిపూడి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటని కాంగ్రెస్ పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ మొవ్వ మోహనరావు పేర్కొన్నారు. కూచిపూడి సెంటర్‌లో నిర్వహించిన మన్మోహన్ సింగ్ సంతాప సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. మన్మోహన్ అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు దేశాన్ని అగ్రభాగాన నిలపటానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. నిరాడంబర జీవితాన్ని గడిపి ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిట్టు శ్రీనివాసరావు, మద్దాల నాగభూషణరావు, కాగిత సోమేశ్వరరావు, పాపారావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



పామర్రు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఇరుముడులతో శబరి యాత్రకు పయనమైన అయ్యప్ప దీక్షాపరులు

వైభవంగా ఇరుముడులు

పామర్రు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వాసవీ మాత ఆలయంలో గురువారం ఇరుముడులు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నారాబిందెల శ్రీనివాసరావు గురుస్వామి ఆయన శిష్యబృందం భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం అయ్యప్ప దీక్షాపరులు ఊరేగింపు నిర్వహించి శబరిగిరియాత్రకు పయనమయ్యారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, బొగ్గవరపు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలొద్దు

గుడివాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం వలన ఎందరో ప్రాణాలను నిలబెట్టవచ్చునని, అపోహలు పెట్టుకోకుండా రక్తదానం పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి భవిరి శంకరనాథ్ సూచించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం పాల్గొన్నారు.

గుండెపోటుతో మండల పరిషత్ ఏవో మృతి



పెదపారుపూడి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ, మంచి ఉద్యోగిగా పలువురి మన్ననలు అందుకున్న మండల పరిషత్ పరిపాలనాధికారి గుంజా మాధవరావు మృతి బాధాకరమని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. మండల పరిషత్ ఏవో మాధవరావు బుధవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. గురువారం గుడివాడలో ఆయన భౌతికకాయానికి ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, పీఆర్ ఏఈ దేవినేని రామ్మోహన్‌రావు, ఏపీవో నత్తా స్ఫూర్తి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సాగర రాణి, నరేష్, సురేంద్ర, కృష్ణవేణి, లావణ్య, హకల్య, కిరణ్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది నివాళులర్పించారు.



లిఫ్టర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

పవర్ లిఫ్టర్లకు అభినందన

గుడివాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో క్రీడా రంగం నిర్వీర్యమైందని, క్రీడలను ప్రోత్సహించి, క్రీడాంధ్రప్రదేశ్‌గా రూపొందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు వెళుతున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఇటీవల మైలవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఫిట్‌జోన్ జిమ్ లిఫ్టర్లు వివిధ విభాగాల్లో 6 బంగారు, నాలుగు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించిన సందర్భంగా లిఫ్టర్లను గురువారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అభినందించారు. డాక్టర్ మాగంటి శ్రీనివాస్, గోకవరపు సునీల్, మహ్మద్ రఫీ, షేక్ సైదా పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు సత్కారం

గుడివాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ బి.శ్రీనివాసరావును మున్సిపల్ షాపుల లీజుదారుల అసోసియేషన్ సభ్యులు గురువారం సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నవోదయ శ్రీనివాస్, సభ్యులు సయ్యద్ గఫార్, కృష్ణ, కొత్త సుబ్బారావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.550

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

అవనిగడ్డ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్ అన్నారు. గ్రామసభకు పంచాయతీ కార్యదర్శి అనిత అధ్యక్షత వహించారు. గ్రామసభకు ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరు కావటం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలంకారీ క్లస్టర్‌తో ఉపాధి అవకాశాలు

పెడన, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కలంకారీ క్లస్టర్ ఏర్పాటు చేసి పెడనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువస్తామని, కలంకారీ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు అనువైన స్థలాలను బుధవారం ఆయన పరిశీలించారు. పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆనుకున్న స్థలంతో పాటు డంపింగ్ యార్డు సైట్‌ను కూడా ఆయన పరిశీలించారు. బాలాజీ మాట్లాడుతూ, కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు సుమారు ఏడెకరాల స్థలం అవసరమవుతుందన్నారు. క్లస్టర్ ఏర్పాటుతో కలంకారీ రంగంలో మెరుగైన ఉత్పాదకత సామర్థ్యం, నాణ్యత, మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్. వెంకట్రావు, ఆర్డీవో కె. స్వాతి, కమిషనర్ ఎం. గోపాలరావు, తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ



యోగా శిక్షణలో కలెక్టర్ డీకే బాలాజీ

యోగాతో దీర్ఘకాలిక రోగాలకు చెక్

మచిలీపట్నం టౌన్, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : యోగాతో దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని ప్రొఫెసర్ దమయంతి (ఉత్తరప్రదేశ్)పేర్కొన్నారు. చింతగుంటపాలెంలో ప్రత్యేక యోగశిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొని సందేశమిచ్చారు. యోగ శిక్షణను కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన యోగసాధకులు జల, నేతి ప్రక్రియ చేశారు. తలనొప్పి, కడుపు నొప్పి రోగాల నివారణకు దోహదం చేసే యోగాసనాలు నేర్పారు. ప్రాణాయామం, ధ్యాన పద్ధతులపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఘంటసాల గురునాథబాబు, మద్దాల చింతయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వీర్నాల ఫౌండేషన్ ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న పోటీలకు అతిథిగా విచ్చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని వీర్నాల ఫౌండేషన్ అధ్యక్షుడు వీర్నాల బాలాజీ ఆహ్వానించారు. చాంబర్‌లో కలెక్టర్ డీకే బాలాజీని ఆయన కార్యక్రమాల వివరాలను వివరించారు. ఈనెల 8వ తేదీ హిందూ కళాశాల ప్రాంగణంలో మ్యాథ్స్ ఒలింపియాడ్, క్విజ్ పోటీలు, 9న చదరంగం, వక్తృత్వ పోటీలు, యువతీ యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ పోటీల్లో సీనియర్స్‌కు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీ య బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, కబడ్డీ జూనియర్స్‌కు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందిస్తున్నామన్నారు. వివిధ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ. 10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 5 వేలు, తృతీయ బహుమతిగా రూ. 2500 అందజేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో దుర్గాప్రసాద్

విద్యలో యాజమాన్య కమిటీల పాత్ర కీలకం

మచిలీపట్నం టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల విద్యావిషయక కార్యక్రమాల్లో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని ఎంఈవో ఎం.వి.దుర్గాప్రసాద్ అన్నారు. నోబుల్ కళాశాలలో పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎంపికైన తల్లిదండ్రులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల పరిశీలించాలని, విద్యార్థులు బడి మానకుండా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. బడిబయట పిల్లలను సక్రమంగా బడికి పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతల విరాళాలు సేకరించాలన్నారు. రిసోర్సుపర్సన్లు వి. శ్రీనివాసరావు, కె. విజయ్, జొన్నలగడ్డ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి

ఆధునిక సాగు విధానాలు అవలంబించాలి

మోపిదేవి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ వ్యవసాయ విధానాలపై రైతుల ఆసక్తి చూపాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి విజ్ఞప్తి చేశారు. మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేశారు. యంత్ర పరికరాలను సద్వినియోగపర్చి, సేంద్రియ విధానాలపై ఆసక్తి చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శన ఆకట్టుకుంది. సర్పంచ్ నందిగం మేరీ రాణి, జడ్పీటీసీ సభ్యురాలు మెడబలిమి మల్లిఖార్జునరావు, కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్త సత్యప్రియ లలిత, శాస్త్రవేత్త నవీన్, ప్రధానోపాధ్యాయురాలు జయంతి, రైతులు పాల్గొన్నారు.

ఆక్వా రంగం అభివృద్ధికి చర్యలు

బంటుమిల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రంగం అభివృద్ధికి చర్యలు చేపట్టామని మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్ అన్నారు. బంటుమిల్లి మత్స్యశాఖ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడారు. రైతులు ఆక్వా చెరువులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులు, కొనుగోలు, అమ్మకాలు అన్నీ కూడా బార్ కోడ్ ఆధారంగా నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ లేబొరేటరీల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. రెండు, మూడు నెలల్లో బంటుమిల్లి ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. మత్స్యశాఖ ఇన్‌చార్జ్ జేడీ నాగబాబు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల ఎఫ్‌డీవోలు సాయికృష్ణ, నాగ అంజనీ, నందివాడ, గుడివాడ ఎఫ్‌డీవో రవి, మం జూష, మచిలీపట్నం ఏడీ రమేష్, అవనిగడ్డ ఏడీ ప్రతిభ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న హన్సిక ఫణిదేవి

సైన్స్ ఫెయిర్‌లో హన్సిక ఫణిదేవి ప్రతిభ

ఘంటసాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో శ్రీకాకుళం జడ్పీహైస్కూల్ విద్యార్థిని టి.హన్సిక ఫణిదేవి ప్రదర్శించిన ఫింగర్ ప్రింట్ బేస్డ్ కార్ డిటెక్టర్ ఎగ్జిబిట్‌కు వ్యక్తిగత విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం లభించింది. హన్సిక ఫణిదేవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ వి.బాలసునీత, విద్యార్థినిని ఎంఈవోలు శివశంకర్‌రావు, మహమ్మద్ మోమిన్, ఎస్ఎంసీ చైర్మన్ కోడి కోటేశ్వరమ్మ, వైస్ చైర్మన్ పులగం రాజేంద్ర, గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు అభినందించారు.

పింఛన్లు మంజూరు చేయండి

మోపిదేవి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సర కాలంగా మం జూరు దశలో నిలిచిపోయిన సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ లబ్ధిదారులు ఆయా గ్రామసభల్లో విజ్ఞప్తి చేశారు. పెదప్రోలు, వెంకటాపురం, పెదకళ్లేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు జరిగాయి. సర్పంచ్‌లు పోలిమెట్ల ఏసుబాబు, తుమ్మా సోములమ్మ, అరజా సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో అభివృద్ధి కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆషాదేవి, పంచాయతీ కార్యదర్శులు రామకోటేశ్వరరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు భాస్కరరావు

అవుట్ ఫాల్ స్లూయిస్ పునర్నిర్మాణం చేయండి

కోడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సాలెంపాలెం సమీపంలోని అవుట్ ఫాల్ స్లూయిస్ పునర్నిర్మాణం చేయాలని ఎంపీటీసీ సభ్యుడు లంకే భాస్కరరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని, అవనిగడ్డ నుంచి భవానిపురం మీదుగా మచిలీపట్నం ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని, విరిగిన స్తంభాలను పునరుద్ధరించాలని వార్డు సభ్యులు కోరారు. ఎంపీడీవో సుధా ప్రవీణ్, తహసీల్దార్ శ్రీను నాయక్, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఐదు వేల ఎకరాలు సాగులోకి తేవటమే లక్ష్యం

• 80 మంది వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరిక

అవనిగడ్డ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఐదు వేల ఎకరాల తీర ప్రాంత భూములను సాగులోకి తీసుకు రావటమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కోడూరు మండలం ఊటగుండం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరారు. తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఊట గుండం గ్రామానికి చెందిన కూరాకు సురేష్‌తో సహా 80 మంది వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జనసేన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ అసమాన్య నాయకుడని, తీర ప్రాంత గ్రామాల్లోని మత్స్యకారులు, బలహీనవర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. రైతుల సమస్యలను గుర్తించే సామాన్య రైతు దేవనబోయిన వెంకటేశ్వరరావుకు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవిని ఇచ్చి గౌరవించారన్నారు. జనసేన నేతలు మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, మర్రే గంగయ్య, పూషడపు రత్నగోపాల్, కొండవీటి సునీత, ఇజ్జినేని శివాజీ, పూతబోయిన కరుణకుమార్, సిద్ధినేని అశోక్ నాయుడు, బాదర్ల లోలాక్షుడు, కొల్లి వెంకటేశ్వరరావు, దేవనబోయిన కేశవ నారాయణ, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, పూతబోయిన లక్ష్మణరావు, కూరాకుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



నవలంకలో గాలిపటాలను ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే మండలి, విద్యార్థినులు



ఇసుక తిన్నెలపై విద్యార్థినుల నృత్యాలు

నవలంకలో సంక్రాంతి సందడి

• పతంగుల పండుగ • సంప్రదాయ దుస్తుల్లో అలరించిన విద్యార్థినులు

నాగాయలంక జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక కృష్ణానదికి మధ్య ఉన్న నవలంక ద్వీపంలో ఎస్‌వీఎల్ విద్యాసంస్థల అధినేత దుట్టా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం పతంగుల పండుగ గురువారం సందడిగా నిర్వహించారు. వందలాది మంది విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో నవలంక ద్వీపానికి తరలివచ్చి ఉత్సాహంగా గాలిపటాలను ఎగురవేశారు. ఇసుక తిన్నెలపై సినిమా పాటలకు విద్యార్థులు అభినయించి సందడి చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పోటీలను ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. గతంలో నాగాయలంకలో పడవల పోటీలు నిర్వహించామని, త్వరలో మరో భారీ కార్యక్రమం ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, ఎస్‌వీఎల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, తలశిల రఘుశేఖర్, ఎస్ఐ రాజేష్, ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, బడే సుబ్బారావు గ్రామస్థులు పాల్గొన్నారు. నవలంకలోని గుడారంలో అతిథులు సేదతీరగా, విద్యార్థులు కృష్ణమ్మ సోయగాలను వీక్షించారు.



మల్లవోలులో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

మల్లవోలులో డ్యాన్స్ బేబీ డ్యాన్స్


గూడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మల్లవోలు గాంధీబొమ్మ సెంటర్‌లో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా గురువారం చిన్నారులతో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు వివిధ పాటలకు నృత్యాలు చేసి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. చిన్నారులకు ముద్దినేని వెంకటేశ్వరరావు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహనత్రినాథ్, తుర్లపాటి శేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న పిచ్చేశ్వరరావు

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహం

ఘంటసాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన గోగినేనిపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థినులు గండ్ర నవ్యకు రూ.20 వేలు, వేములమడ సాత్వికకు రూ.30 వేలు నగదును పిన్నమనేని వెంకయ్య జ్ఞాపకార్థం కుమారుడు డాక్టర్ పిన్నమనేని లెనిన్ ప్రోత్సాహంగా అందజేశారు. పాఠశాల పీఎంసీ చైర్మన్ మ ల్లం పాటి పిచ్చేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం నగదు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


అవనిగడ్డ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ అలివేలు మంగ రాజ్యలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం గురువారం భక్తులతో కిటకిటలాడింది. శ్రవణ నక్షత్రం సందర్భంగా అర్చకులు అగ్నిహోత్రం విఖనస, ఇతర అర్చకులు స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మండలి భావన్నారాయణ నేతృత్వంలో అన్నసమారాధన నిర్వహించగా, ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరాచార్య పర్యవేక్షించారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న బండే శ్రీనివాసరావు, టీడీపీ నేతలు

టీడీపీ సరి కొత్త రికార్డు

కోడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కోటికిపైగా సభ్యత్వాలు నమోదు చేసి టీడీపీ సరికొత్త రికార్డును సృష్టించిందని మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయం వద్ద సభ్యత్వాల నమోదు చేశారు. తోట సాంబశివరావు, మోపిదేవి భాస్కరరావు, కనకమేడల హరిబాబు, వేములపల్లి రాజేష్, తోట సూర్యనరసింహారావు, అప్పికట్ల రవీంద్రబాబు, కొప్పనాతి వెంకటేశ్వరరావు, మేడూరి మరిడయ్య, మహమ్మద్ ఇమ్రాన్, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కోడూరు నుంచి శబరిమల యాత్రకు తరలివెళ్తున్న దీక్షాపరులు

కోడూరు నుంచి వంద మంది శబరిమల యాత్ర

కోడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కోడూరు అయ్యప్పస్వామి దేవాలయం వద్ద నుంచి 100 మంది దీక్షాదారులు శబరికొండకు బయలుదేరి వెళ్లారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టుకుని, భారీ అన్నదానం నిర్వహించి శబరియాత్రకు తరలివెళ్లారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ పర్యవేక్షించారు.

వేణు మాధవ స్వామికి లక్ష తులసి పూజ



గూడూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా గూడూరు మాధవ స్వామి దేవస్థానంలో స్వామి వారికి లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కలపటం నవరంగకిషన్ ఆధ్వర్యంలో అర్చకులు గంజాం సీతారామాచార్యులు స్వామి వారికి లక్ష తులసి దళాలతో అర్చించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పాస్టర్ విజయకుమార్‌కు సత్కారం

నాగాయలంక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని పెదపాలెంలోని హోలీఫైర్ చర్చిలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్ ఎం.విజయకుమార్ దంపతులను మండల తెలుగు యువత అధ్యక్షులు మేడికొండ విజయ్, కర్రావేణు సత్కరించారు. విశ్వాసులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

అవనిగడ్డ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరుతూ వీహెచ్‌పీ సభ్యులు కరపత్రాలు పంపిణీ చేశారు. బసవ శంకరరావు, గరికిపాటి వీరాంజనేయులు, అరజా ఏడుకొండలు, మండలి భావన్నారాయణ గుమ్మడి నరసింహరావు పాల్గొన్నారు. మోపిదేవి : హైందవ శంఖారావం బహిరంగ సభకు తరలిరావాలంటూ మోపిదేవి మండల శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. బవస శంకరరావు, వీరాంజనేయులు, ఏడుకొండలు, గుమ్మడి నరసింహారావు ఉన్నారు.